అనుదినం జనపక్షం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
1
ఆదివారం 30 జులై 2023

కోట్నాక్ భీంరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ

నవతెలంగాణ-జన్నారం

కొన్ని రోజులుగా కురిసిన భారీ వర్షాలకు మండలంలోని వరద బాధితులకు కోట్నాక్ భీంరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం నిత్యావసర సరుకులను చైర్మన్ కోట్నాక్ రమేష్ అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. వారికి తక్షణమే సాయం అందించి ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ కోశాధికారి తొడసం గంగు పటేల్, నాగపూర్ ఉప సర్పంచ్ ఇరుకొండ విజయ్, దశరథ్, కొట్నాక్ దినేష్ పాల్గొన్నారు.



మీడియాను పాఠశాలల్లోకి అనుమతించకపోవడం సిగ్గుచేటు

నవతెలంగాణ-హాజీపూర్

ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తూ నిత్యం ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే మీడియాను ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లోకి అనుమతించ కూడదని సర్క్యులర్ జారీ చేయడం సిగ్గుచేటని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తోట్ల మల్లేష్ యాదవ్, గోపతి సత్తయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మీడియాను అనుమతించకపోవడానికి పాఠశాలల్లో అంతలా ఏం జరుగుతోందని ప్రశ్నించారు. ఇదివరకే ప్రయివేట్ పాఠశాలల యజమాన్యాలు ఇష్టారీతిన వ్యవహరిస్తూ అధిక ఫీజులు వసూలు చేస్తూ అరకొర సౌకర్యాలతో విద్యార్థుల తల్లిదండ్రుల నడ్డి విరుస్తున్నాయని పేర్కొన్నారు. ఇప్పుడు మీడియాను పాఠశాలల్లోకి అనుమతించకపోతే వాళ్ల ఆగడాలు మితిమీరిపోయే ప్రమాదముందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్‌ను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

నిర్మల్ ఆర్టీఓపై విచారణ..!

- లైసెన్సుల అక్రమాలపై ఎంక్వైరీకి ఆదేశం
- ఈ మెయిల్ ఫిర్యాదులపై స్పందించిన రవాణశాఖ
- ఆదిలాబాద్ డీటీసీకి బాధ్యత అప్పగింత
- ఇలాంటి వ్యవహారాల్లో డీటీసీ పుప్పాల అనుభవానికి గుర్తింపు
- త్వరలో తేలనున్న అక్రమాల వ్యవహారం

నిర్మల్ జిల్లా రవాణశాఖ కార్యాలయం కేంద్రంగా జరిగిన లైసెన్సులు, ఫిట్‌నెస్‌ల జారీలో అక్రమాలపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. నిర్మల్ జిల్లా రవాణశాఖ అధికారి వ్యవహారంపై విచారణ చేపట్టాలని రాష్ట్ర రవాణశాఖ కమిషనర్ ఈ నెల 7న ఉత్తర్వులు జారీ చేయడం చర్చనీయాంశమైంది. విచారణ బాధ్యతలను ఆదిలాబాద్ జిల్లా ఉప రవాణశాఖ అధికారి పుప్పాల శ్రీనివాస్‌కు అప్పగించడం ప్రాధాన్యం సంతరించుకుంది. నిర్మల్ జిల్లాలో వాహన లైసెన్సుల జారీతో పాటు ఫిట్‌నెస్ వ్యవహారాల్లో అక్రమాలు చోటు చేసుకున్నాయని రాష్ట్ర ఉన్నతాధికారులకు ఈమెయిల్ ద్వారా ఫిర్యాదులు వెళ్లాయి. లైసెన్సుల జారీలో నిర్మల్ జిల్లా అధికారులు నిబంధనలు తుంగలో తొక్కారని ఈ ఫిర్యాదుల సారాంశం. వీటిపై స్పందించిన ఆ శాఖ కమిషనర్ ఈ అంశంలో నిజాలు నిగ్గుతేల్చాలని ఉత్తర్వులు జారీ చేశారు.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

రోడ్డుభద్రత నియమాలను నిక్కచ్చిగా పాటించాల్సిన రవాణశాఖ అధికారులు వాటిని తుంగలో తొక్కుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. కాసులకు కక్కుర్తిపడి ఇష్టారీతిన లైసెన్సులు జారీ చేస్తున్నట్లు పెద్ద ఆరోపణలున్నాయి. తాజాగా నిర్మల్ జిల్లా ఆర్టీఓ కార్యాలయంలోనూ ఇదే తరహా అక్రమాలు జరిగినట్లు ఆరోపణలున్నాయి. వాహనదారులకు జారీ చేసే లైసెన్సులు, ఫిట్‌నెస్ పత్రాల జారీలోనూ ఈ అక్రమాల తంతు సాగిందని ఫిర్యాదులున్నాయి. ఈ కార్యాలయంలో ఏజెంట్ల ద్వారా డబ్బులు తీసుకొని లైసెన్సులు జారీ చేసి నిబంధనలు విస్మరించినట్లు తెలుస్తోంది. కార్యాలయానికి లైసెన్సు కోసం నేరుగా వచ్చిన వారిని డ్రైవింగ్ టెస్టులో ఫెయిల్ చేయడం.. అదే ఏజెంట్ల ద్వారా రూ.6500వరకు చెల్లిస్తే వారినే రెండు, మూడు రోజుల్లో మళ్లీ పాస్ చేసి లైసెన్సులు జారీ చేసినట్లు ఆరోపణలున్నాయి. నేరుగా వస్తే ఫెయిల్ అవుతారని అక్కడి సిబ్బందే చెబుతున్నట్లు ఫిర్యాదులున్నాయి. ముఖ్యంగా లైసెన్సు కోసం వచ్చిన వారు ఫెయిల్ అయిన తేదీలు.. వారికే మళ్లీ జారీ చేసిన తేదీలకు పొంతన కుదరకపోవడం పరిణామాలు చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. ఇలాంటి అక్రమాలు జరిగినట్లు కొందరు వ్యక్తులు సాక్ష్యాలతో సహా రాష్ట్ర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

విచారణ బాధ్యత ఆదిలాబాద్ డీటీసీకి

లైసెన్సుల జారీలో జరిగిన అక్రమాలపై వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా ఈ అంశంపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని ఆ శాఖ రాష్ట్ర కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎంక్వైరీ బాధ్యతను ఆదిలాబాద్ ఉప రవాణశాఖ అధికారి(డీటీసీ) పుప్పాల శ్రీనివాస్‌కు అప్పగించారు. రాష్ట్రస్థాయిలో ఇలాంటి ఎంక్వైరీ వ్యవహారాల్లో పుప్పాలకు అనుభవం ఉండటం.. విచారణలో నిక్కచ్చిగా వ్యహరిస్తారనే పేరు ఉండటంతోనే తాజా బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తోంది. మరోపక్క ఆరోపణలు ఎదుర్కొంటున్న నిర్మల్ ఆర్టీఓ కూడా ఆదిలాబాద్ డీటీసీ బ్యాచ్‌కు చెందిన వ్యక్తి కూడా గమనార్హం. త్వరలోనే నిర్మల్ ఆర్టీఓ కార్యాలయంలో లైసెన్సుల జారీలో జరిగిన అవకతవకలు జరిగాయా లేదా అనేది విచారణ అనంతరం పూర్తిస్థాయిలో వెల్లడికానుందని తెలుస్తోంది.

మణిపూర్ ప్రజలకు రక్షణ కల్పించాలి

- మంచిర్యాలలో ప్రజాసంఘాల నిరసన ప్రదర్శన



నవతెలంగాణ-హాజీపూర్

ఈశాన్య రాష్ట్రమైన మణిపూర్‌లో సామాన్య ప్రజలకు రక్షణ కల్పించి, మహిళలపై దారుణాలకు తెగబడ్డ నిందితులను కఠినంగా శిక్షించాలని వివిధ ఉపాధ్యాయ, ఉద్యోగ, యువజన, దళిత సంఘాల నాయకులు పేర్కొన్నారు. శనివారం మంచిర్యాల అంబేద్కర్ విగ్రహం దగ్గర వారు నిరసన ప్రదర్శన చేపట్టారు. మణిపూర్ రాష్ట్రంలో మూడు నెలలుగా అల్లకల్లోల పరిస్థితి నెలకొని, సామాన్య ప్రజలు భయంతో గడుపుతున్నా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి చర్యలూ చేపట్టడం లేదని పేర్కొన్నారు. సరిహద్దు రాష్ట్రంలో ప్రజల మధ్య తగవులు దేశభద్రతకు ముప్పు కలిగిస్తుందని వారు పేర్కొన్నారు. ఆదివాసులకు మైదాన ప్రాంత ప్రజలకు మధ్య తగవులు పెట్టి రాజకీయ నాయకులు పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. రాజ్యాంగం ప్రసాదించిన ఆదివాసీ హక్కులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత పాలకులదేనని తెలిపారు. బాధితులకు రక్షణ కల్పించాల్సిన పాలకులు మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చులు పెట్టి, తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవాలని చూస్తున్నారని వారు విమర్శించారు. ఏ మతం, ఏ తెగవారైనా భరతమాత బిడ్డలేనని, వారి హక్కులను కాపాడడం ప్రభుత్వాల బాధ్యత అని తెలిపారు. అంబేద్కర్ రచించిన సంక్షేమ రాజ్యాంగం ప్రకారం పాలకులు ప్రవర్తించాలని వారు హెచ్చరించారు. మహిళలను నగ్నంగా ఊరేగించిన సంఘటన జరిగి రోజులు గడుస్తున్నా పాలకులు స్పందించకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. దేశభక్త పౌరులందరూ పాలకుల తీరుని నిరసించి మణిపూర్ ప్రజల రక్షణ కోసం ఉద్యమించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దళిత బహుజన ఐక్య వేదిక కన్వీనర్ పలిగిరి కనకరాజు, భారత్ బచావో జిల్లా అధ్యక్షులు కనుకుంట్ల మల్లయ్య, సామాజిక న్యాయ వేదిక కన్వీనర్ రంగు రాజేశం, ఐక్య ఉపాధ్యాయ సంఘం నాయకులు రాజవేణు, తిరుపతి, ఆగాచారి, ప్రజాస్వామిక ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి మోతె జయకృష్ణ, జాకీర్ హుస్సేన్, ప్రజాస్వామిక యువజన సంఘం నాయకులు ప్రేమ్‌కుమార్, మహేష్, ఐఎన్టీయూసీ నాయకులు సమ్ము రాజయ్య, సామాజిక ఉద్యమకారులు కైలాసం, కొండయ్య, ఇబ్రహీం, ఆర్టీసీ జేఏసీ నాయకులు పాషా, కిరణ్ కుమార్, రమేష్, అప్పారావు, శ్రీనివాస్‌రెడ్డి, కైలాసం పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్య పరిరక్షణకు 7 నుండి సమరభేరి జీపు యాత్ర

నవతెలంగాణ-నిర్మల్

ప్రభుత్వ విద్య పరిరక్షణకు సమరభేరి జీపు యాత్రను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శీతల్కర్ అరవింద్ అన్నారు. శనివారం ప్రజా సంఘాల కార్యాలయంలో జీపు యాత్ర కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆగస్టు 7 నుండి 11 వరకు జీపు యాత్ర 12మండలాల్లో కొనసాగుతుందన్నారు. 7న ఖానాపూర్ పట్టణంలో ప్రారంభించి, ఆగస్టు 11న ముథోల్ పట్టణంలో ముగిస్తుందన్నారు. బాసర ట్రిబుల్ ఐటీ విద్యార్థుల 12 డిమాండ్స్ పరిష్కరిస్తామన్నా మంత్రి కేటీఆర్ ఏ ఒక్క డిమాండ్ కూడా పూర్తిస్థాయిలో పరిష్కరించలేదని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో పీజీ కళాశాలలో అన్ని కోర్సులు ప్రారంభించి, అన్ని వసతులు కల్పిస్తామని, ప్రతి ఏడాది అనడం తప్ప ఆచరణలో విఫలమయ్యారని పేర్కొన్నారు. విద్యార్థులకు రావాల్సిన సుమారు రూ.5,177కోట్ల స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్స్ తక్షణమే విడుదల చేయాలని, గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ యాత్రలో విద్యార్థులు, మేధావులు, ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నవీన్, నాయకులు యువరాజ్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి



నవతెలంగాణ-సిరికొండ

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సిరిచెల్మ కేటీఆర్ ఎఫ్ఆర్ఓ గణేష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో, కేజీబీవి పాఠశాలలో గ్లోబల్ టైగర్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని సూచించారు. చెట్లను నరికితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారులు గీరయ్య, అమర్‌సింగ్, ఫారెస్ట్ సెక్షన్ అధికారి వసంత్ కుమార్, నాయకులు పెంటన్న, ఇక్బాల్, చందు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్య పరిరక్షణకు పోరాటానికి సిద్ధం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వ విద్య పరిరక్షణకు పోరాటానికి సిద్ధంగా ఉన్నామని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జాఫర్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించి, వాటిని అభివృద్ధి చేయాలన్నారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందన్నారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియింబర్స్‌మెంట్స్ సరైన సమయంలో ఇవ్వకపోవడంతో పేద విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. మతోన్మాద విధానాలను కొనసాగిస్తూ కేంద్ర ప్రభుత్వం డార్విన్ సిద్ధాంతాన్ని సిలబస్ నుండి తొలగించడాన్ని ఖండించారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో సరైన స్థాయిలో ఉపాధ్యాయులు లేరని, దీంతో విద్యార్థులు ఇబ్బంది పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. శాశ్వత ప్రాతిపదికన ఉపాధ్యాయులను నియమించాలని, లేదంటే విద్యా వాలంటీర్ వ్యవస్థను పునర్వ్యవస్థీకరించాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు రాంచందర్, మారుతి, తిరుపతి పాల్గొన్నారు.

అన్నాభావు సాటే జయంతి ఉత్సవాలు విజయవంతం చేయాలి



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

మాంగ్ సమాజ్ తెలంగాణ రాష్ట్ర సంఘం అధ్యక్షులు గైక్వాడ్ తులసీదాస్ మాంగ్ ఆధ్వర్యంలో డాక్టర్ సాహిత్య సామ్రాట్ అన్నాభావు సాఠే 103వ జయంతి కార్యక్రమం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆగస్టు 1న మధ్యాహ్నం 1గంటకు నిర్వహిస్తున్నామని జిల్లా అధ్యక్షులు గాడేకర్ పరుశురాం అన్నారు. శనివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జయంతి కార్యక్రమానికి మంత్రి కొప్పుల ఈశ్వర్, ఇతర ప్రముఖ వ్యక్తులు అతిథులుగా హాజరవుతున్నారని, రాష్ట్రం నలుమూలల నుంచి మాంగ్ సమాజ్ ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. విలేకరుల సమావేశంలో టి.విఠల్, జి.సంజయ్, జి.సుభాష్, ఓంకార్ పాల్గొన్నారు.

టైగర్ జోన్ నుంచి తరలించే గ్రామాలకు వసతులు కల్పించాలి



జన్నారం : 42వ కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలోని గ్రామాల తరలింపు ప్రక్రియను ప్రభుత్వం ముమ్మరం చేసిన దృష్ట్యా వారిని తరలించే ప్రదేశాలలో అన్ని రకాల సౌకర్యాలు కల్పించి రూ.15లక్షలు అందించాలని కాంగ్రెస్ నియోజకవర్గ సీనియర్ నాయకులు పెందూర్ ప్రభాకర్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మైసంపేట, రాంపూర్ గ్రామాల నుంచి 142 కుటుంబాలను తరలించాలని అటవీ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారని, ఆ కుటుంబాలకు రూ.15లక్షల చొప్పున అందజేసి వారుండే ప్రాంతాల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. మండలంలోని కొన్ని గ్రామాలను తరలించడానికి ప్రయత్నాలు సాగుతున్నాయన్నారు. వారికి కూడా అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించిన తర్వాతే ఆ గ్రామాలను తరలించాలని డిమాండ్ చేశారు. లేకుంటే గిరిజన ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో కాంగ్రెస్ పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతుందని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో మండల అధ్యక్షులు ముజాఫర్ అలీఖాన్, సీనియర్ నాయకులు మంగం విజయరావు, యూత్ కాంగ్రెస్ నాయకులు సిడాం శేషు, రాహుల్, అర్క శ్రీనివాస్ పాల్గొన్నారు.

మండలంలో సామాజిక తనిఖీ



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో రెండు సంవత్సరాల కాలంలో జరిగిన పనుల చెల్లింపుల వివరాలు తనిఖీ చేయడానికి నాలుగు రోజుల క్రితం సామాజిక తనిఖీ బృందం మండలానికి చేరుకుంది. సంబంధిత ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు రికార్డులను తయారు చేసి తనిఖీ బృందానికి ఇవ్వడంలో జాప్యం జరుగుతుందని ఇప్పటివరకు కొన్ని గ్రామాలకు సంబంధించిన వివరాలు మాత్రమే అందజేసినట్టు ఎస్ఆర్‌పీ రవి తెలిపారు. మండలంలో మొత్తం సుమారు 15కోట్ల50లక్షల పనులు జరిగాయని, ఇందులో బజార్‌హత్నూర్, చందునాయక్‌తండా, భూతాయి, రాంపూర్ గ్రామాలలో అత్యధికంగా పనులు చేసినట్టు రికార్డులో ఉన్నాయని, క్షేత్రస్థాయిలో చెల్లింపులు జరిగాయా లేదా అనే విషయాలు సంబంధిత కూలీలకు అడుగుతూ పనులు పరిశీలిస్తామని తెలిపారు. తనిఖీలు నామమాత్రంగా కాకుండా పకడ్బందీగా చేపట్టి అక్రమార్కులను బయటికి తీయాలని మండల నాయకులు, ప్రజలు కోరుతున్నారు.

డాక్టర్ సినారె జయంతి సభ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని వినాయక్‌చౌక్ సరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో విఖ్యాత తెలంగాణ కవి డాక్టర్ సి.నారాయణరెడ్డి జయంతిని శనివారం తెలంగాణా రచయితల వేదిక జిల్లా శాఖ తరపున నిర్వహించారు. ప్రముఖ పద్య కవి, తెలంగాణ రచయితల వేదిక జిల్లా కార్యదర్శి చిందం ఆశన్న ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ కథా రచయిత బి.మురళీధర్, కవులు సామల రాజవర్ధన్, మన్నె ఏలియా, మధుసూధన్‌రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్సింగ్‌రావు హాజరయ్యారు. సభలో డాక్టర్ సి.నారాయణరెడ్డి రచనలు, వారి వ్యక్తిత్వం గురించి వక్తలు తమ అనుభవాలను పంచుకున్నారు. నారాయణరెడ్డి కావ్యాలు, కవితా సంకలనాలు, గజల్లు మొదలైన అన్ని విషయాలను చర్చించారు. సినీ గీతాల విశ్లేషణలతో పాటు సినీ గీతాలను, గజల్లను గానం చేశారు. కార్యక్రమంలో కవులు టి.చరణ్‌దాస్, పసుల ప్రతాప్, అల్లూరి భూమన్న, దేవిదాస్, నర్సిములు, శ్రీనివాస్, వెంకటి, బట్టు అరుణ, నవనీత, ఎలిజబెత్ విక్టోరియా రాణి, రేడియో జాకీలు కట్టా లెనిన్, పొద్దుటూరి కమలాకర్‌రెడ్డి, శిశు మందిర్ ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



సిర్పూర్(టి): కొన్ని రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షంతో మహారాష్ట్రలోని హిరాయి, వార్ధా డ్యాం గేట్లు ఎత్తడంతో పెన్‌గంగ ప్రవాహం అధికం కావడంతో కౌటాల, సిర్పూర్ మార్గమధ్యలో ఉన్న పారిగాం రోడ్డు డ్యాంపై నుండి వరద నీరు వెళ్లడంతో రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే వెంకట్రావ్‌పేట్, పోడ్సా, హుడ్కిళి, సిర్పూర్ మార్గమధ్యలో గల వంతెనలపై ప్రవాహం ఎక్కువ కావడంతో రాకపోకలు నిలిచిపోయాయి. శనివారం పారిగాం, సిర్పూర్ మార్గమధ్యలో గల రోడ్డుపై ప్రవహిస్తున్న నీటి ప్రవాహాన్ని అడిషనల్ కలెక్టర్ వేణు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రయాణికులు నీటి ప్రవాహం దాటి వెళ్లొద్దని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ రియాజ్‌అలీ, ఎంపీడీఓ రాజేశ్వర్, డిప్యూటీ తహసీల్దార్ మోబిన్, సిబ్బంది ఉన్నారు.

బెజ్జూర్‌లో పులుల దినోత్సవం



బెజ్జూర్ : అటవీ శాఖ ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని నిర్వహించారు. రేంజ్ కార్యాలయం నుండి బస్టాండ్ వరకు అటవీ శాఖ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పులుల రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని, పులులను సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో సెక్షన్ అధికారులు శ్రీనివాస్, మల్లికార్జున్, బీట్ అధికారులు శ్రీధర్, ముత్యం, శ్రీనివాస్, సంగదీప్, సత్యం, తిరుపతి పాల్గొన్నారు.

దహెగాం : పులులను రక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతని డిప్యూటీ రేంజర్ శ్రీధర్‌చారి అన్నారు. శనివారం అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని పురస్కరించుకొని రెబ్బెన అటవీ శాఖ ఆధ్వర్యంలో గిరవెల్లి, ఖర్జీ, లోహా గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ జంతువైన పులిని కాపాడుకోవాలని, దానికి ఎలాంటి నష్టం కలిగించొద్దన్నారు. అలాగే అడవులు కూడా అంతరించి పోకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓలు రవి, బాబుతో పాటు ఫారెస్టు సిబ్బంది పాల్గొన్నారు.

సంఘం ఎన్నికల దృష్ట్యా బందోబస్తు ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ ఎన్నికలు ఈనెల 30న జరగనున్న నేపథ్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేయాలని అడహక్ కమిటీ గౌరవాధ్యక్షులు దుర్గం శేఖర్ కోరారు. శనివారం వన్‌టౌన్ సీఐ సత్యనారాయణను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడహక్ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. కైలాస్‌నగర్‌లోని అశోక బుద్ధ విహార్‌లో ఎన్నికలు జరగనున్న దృష్ట్యా అందుకు సంబంధించి పటిష్ట బందోబస్తు చర్యలు తీసుకోవాలని కోరారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-కడెం

మండలంలోని సారంగాపూర్ గ్రామ సర్పంచ్ రాజిరెడ్డి చిన నాన్న ఇటీవల మరణించారు. శనివారం విషయం తెలుసుకున్న నిర్మల్ జిల్లా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షులు అజ్మీర శ్యామ్ నాయక్ వెళ్లి సర్పంచ్‌ని, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి వెంట స్థానిక మండల ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారు.



ప్రాజెక్టును సందర్శించిన విపత్తుల ప్రత్యేకాధికారి



నవతెలంగాణ-కడెం

మండల కేంద్రంలోని కడెం ప్రాజెక్టును జిల్లా విపత్తుల ప్రత్యేకాధికారి ముషారఫ్ అలీ ఫారూఖీ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు మీద పర్యటించి, వరదలకు దెబ్బతిన్న గేట్లను కోతకు గురైన ప్రాంతాలను పరిశీలించారు. ప్రాజెక్టు ప్రస్తుత స్థితిగతుల పట్ల ప్రాజెక్ట్ డీఈ బోజదాస్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు గేట్ల మరమ్మతుల పనుల పట్ల ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట కడెం తహసీల్దార్ చిన్నయ్య, ఎంపీఓ ఉపేందర్, ఎస్సై కోసన రాజు, ఎక్సైజ్ అధికారులు, ప్రాజెక్టు అధికారులు, సిబ్బంది ఉన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

నవతెలంగాణ-నార్నూర్

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని హెల్త్ సూపర్‌వైజర్ చరణ్‌దాస్ సూచించారు. శనివారం మండలంలోని నాగల్‌కొండ సబ్ సెంటర్ పరిధిలోని బలాన్‌పూర్ గ్రామపంచాయతీలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీని బాలింతలకు వివిధ పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఇంటింటా తిరిగి అవగాహన కల్పించారు. నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. నీటిలో ఉన్న చిన్న లార్వాలను వారికి చూపెట్టి వాటి ద్వారా దోమలు ఎలా వృద్ధిచెందుతాయో వారికి తెలియజేశారు. ప్రతి రెండు మూడు రోజులకు ఒక్కసారి పాత్రలు శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. వైద్యశిబిరంలో వైద్యసిబ్బంది బాపురావు, మాన్కుబాయి, విమల, ఇందుబాయి ఉన్నారు.

'బాధితులకు అండగా ఉంటాం'



నవతెలంగాణ-ఖానాపూర్

వరదబాధితులకు అండగా ఉంటామని బీఆర్ఎస్ నాయకులు పూర్ణచందర్ నాయక్ అన్నారు. శనివారం ఖానాపూర్ పట్టణంలోని వరద ముంపు ప్రాంతాలైన సుభాష్‌నగర్, అంబేద్కర్ నగర్, శాంతినగర్ పలు కాలనీల్లో ఆయన పర్యటించారు. వివిధ కాలనీలలో వరద వల్ల కొన్ని చోట్ల పూర్తిగా, పాక్షికంగా దెబ్బతిన్న ఇండ్లను స్థానిక కాలనీ వాసులతో కలిసి పరిశీలించారు. అనంతరం వారితో మాట్లాడుతూ అధైర్యపడవద్దని బాధితులకు ప్రభుత్వం పూర్తిగా అండగా నిలుస్తుందని వారికి భరోసానిచ్చారు. కొంత మంది వారి సమస్యలను విన్నవించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఖానాపూర్ యూత్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రి హరీష్‌రావును కలిసిన జెడ్పీటీసీ

నవతెలంగాణ-బోథ్



మండల కేంద్రంలోని పలు అభివృద్ధి పనులకు సంబంధించి శనివారం హైదరాబాద్‌లో మంత్రి హరీష్‌రావును బోథ్ జెడ్పీటీసీ డాక్టర్ సంధ్యారాణి రవీంద్రప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిశారు. బోథ్‌లో నూతన తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరడం జరిందని పేర్కొన్నారు. జిల్లా అధికారుల సమాచార లోపంతో దానికి బదులుగా అధికారులు తక్కువ నిధులు మంజూరు చేశారని తెలిపారు. నూతన భవనం పూర్తి నిర్మాణానికి నిధులు సమకూర్చాలని కోరారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించి, ఉన్నత అధికారులను తెలుసుకొని నిధులు మంజూరు చేస్తానని అన్నారు. అదేవిధంగా గతంలో బోథ్ నియోజవర్గంలో డిగ్రీ కళాశాల మంజూరు గురించి విన్నవించామని కోరగా వాటిని వేరే మండలంలో ఏర్పాటు వలన స్థానిక విద్యార్థులకు ఇబ్బంది పడతారని తెలిపారు. మంత్రి విద్యాశాఖ అధికారులతో మాట్లాడతానని హామీ ఇచ్చారు. రెవెన్యూ డివిజన్ ఏర్పాటు సంబందించిన ఫైల్ మూవ్ అయిందని రెవెన్యూ డివిజన్ ప్రక్రియ ప్రారంభించామని మంత్రి అన్నారు. మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న సామాజిక ఆస్పత్రిని 100 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సవార్ల పండుగను చూడటానికి వెళ్లిన ఓ బాలుడు తప్పిపోయి తిరిగి దొరికిన ఘటన జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని దస్నాపూర్ కాలనీలో శ్రీను, పద్మల కుమారుడు శనివారం మధ్యాహ్నం నుంచి అదృశ్యమయ్యాడు. చుట్టూ పక్కల వెతికినప్పటికీ దొరకపోగా తల్లి డయల్ 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేసింది. దీంతో బ్లూకోట్స్ సిబ్బంది అరవింద్, మహేష్‌రెడ్డి ఆ బాలుడిని పట్టుకొని తల్లిదండ్రులకు అప్పగించినట్లు మావల పోలీస్ స్టేషన్ ఎస్సై వంగ విష్ణువర్ధన్ తెలిపారు. విద్యార్థులకు పాఠశాలలకు సెలవులు ఉన్న నేపథ్యంలో పిల్లలు ఎటు వెళ్తున్నారో ఒక కంట కనిపెడ్తూ ఉండాలని ఎస్సై సూచించారు. పిల్లల పట్ల జాగ్రత్తలు వహించాలని అన్నారు.

సిరాల ప్రాజెక్టు కట్ట తెగి అపారనష్టం

- ఆనవాళ్లు కోల్పోయిన పంట భూములు



నవతెలంగాణ-భైంసా

భారీ వర్షాలు రైతాంగానికి కోలుకోలేని దెబ్బతీశాయి. భైంసా మండలంలోని సిరాల ప్రాజెక్టు చెరువు కట్ట తెగిపోవడంతో ఆయకట్టు రైతులైన ఈలేగాం గ్రామ రైతాంగానికి తీరని నష్టం జరిగింది. భూముల్లో ఇసుక మేటలు వేయడం, పెద్ద పెద్ద బండరాళ్లు, గుంతలు పడటంతో పాటు వాగులుగా మారాయి. ఒక ఎకరం భూమి యధాస్థితికి రావాలంటే బాధిత రైతుకు ఒక్కో ఎకరానికి సుమారు రూ5 లక్షల ఖర్చవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటనష్టం మాట అటు ఉంచితే భారీగా భూ నష్టమే జరిగిపోయిందని వాపోయారు. మండలంలోని ఇలేగాం గ్రామంలో దాదాపు 400 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. సిరాల ప్రాజెక్టు అలుగుద్వారా వచ్చిన నీటితో ఇలేగాం కొత్తచెరువు తెగిపోయి ఈ పరిస్థితి ఏర్పడిందని రైతులు పేర్కొన్నారు. శనివారం ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి, ఇరిగేషన్ కార్పొరేషన్ డెవలప్‌మెంట్ కమిటీ చైర్మెన్ సముద్రాల వేణుగోపాల చారి వేర్వేరుగా వచ్చి నష్టపోయిన పంటలను, చెరువు తెగిన ప్రాంతాన్ని పరిశీలించారు. రైతాంగానికి ఆదుకుంటామని భరోసా కల్పించారు. ప్రాజెక్టును పరిశీలించిన మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి భైంసా మండలంలోని సిరాల ప్రాజెక్టు భారీ వర్షాలకు తెగిపోవడంతో మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి శనివారం ప్రాజెక్టును పరిశీలించారు. ఈ సందర్భంగా పలు విషయాలను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. రైతాంగానికి తీరని నష్టం జరిగిందని ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా ఆదుకుంటామని అన్నారు. ఆయనతో పాటు కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి ఉన్నారు.



ఆరోపణలు రుజువు చేయాలి : ఎమ్మెల్యే



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాంగ్రెస్ పార్టీ నాయకులు కంది శ్రీనివాస్‌రెడ్డి తనపై, తన కుటుంబ సభ్యులపై చేసిన ఆరోపణలను రుజువు చేయాలని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. శనివారం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలను రెచ్చగొట్టేలా తనపై చేసిన వ్యాఖ్యలు, వ్యక్తిగత ఆరోపణలపై న్యాయపరంగా ముందుకెళ్తామని అన్నారు. ఉన్నత చదువులు చదివిన కంది శ్రీనివాస్‌రెడ్డి కనీస సంస్కారం, పద్ధతి లేకుండా వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే స్థాయిలో ఉన్న వ్యక్తిపై కుటుంబ పరంగా, వివాదాస్పదంగా మాట్లాడితే పెద్ద నాయకుడిని అవుతా అన్న భ్రమలో ఉన్నారని అన్నారు. తన ఆస్తుల గురించి చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించిన ఎమ్మెల్యే ఆరోపణలను ఆధారాలతో సహా రుజువు చేయాలని అన్నారు. న్యాయస్థానంలో ఆయన చేసిన ఆరోపణలు రుజువైతే రాజకీయ సన్యాసం తీసుకుని ఎటువంటి శిక్షకైనా సిద్ధంగా ఉంటానని స్పష్టం చేశారు. రుజువు చేయని పక్షంలో తిరిగి అమెరికా పారిపోతాడా అని సవాల్ విసిరారు. గ్రామాల్లో తిరుగుతూ తనను పరోక్షంగా హత్య చేయాలనీ పిలుపునివ్వడం, ఆ విధంగా ప్రోత్సహించడం దారుణమని అన్నారు. కనీస రాజకీయ పరిజ్ఞానం లేకుండా మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. తన గురించి, తన రాజకీయ ప్రస్థానం గురించి నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసన్న ఎమ్మెల్యే కేవలం డబ్బులను ఎరగా చూపి వారి ఓట్లను కొనాలని చేస్తున్న ప్రయత్నాలను ప్రజలే తిప్పి కొడతారని స్పష్టం చేశారు. తనపై చేసిన వ్యక్తిగత, నిరాదర ఆరోపణలకు గానూ పరువు నష్టం కింద కేసులు నమోదు చేస్తున్నామని తెలిపారు. పరోక్షంగా హత్య చేయాలనీ ప్రోత్సహించడంపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని అన్నారు. ఇప్పటి నుండైనా కనీస సభ్యతతో మాట్లాడటం నేర్చుకోవాలని హితవు పలికారు. సమావేశంలో జిల్లా రైతు సమన్వయ అధ్యక్షులు రోకండ్ల రమేష్, పట్టణ అధ్యక్షులు అజయ్, అధికారప్రతినిధి గంగారెడ్డి, కౌన్సిలర్ భరత్, రామ్‌కుమార్, నాయకులు, సాజీదోద్దీన్, ప్రశాంత్, పాల్గొన్నారు.

పంటనష్ట పరిహారం అందేలా చూస్తాం

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

నవతెలంగాణ-సారంగాపూర్

రైతులు అధైర్యపడొద్దని పంట నష్టపరిహారం అందేలా చూస్తామని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ వరుణ్ రెడ్డితో కలిసి సందర్శించారు. వరద ప్రభావిత ప్రాంతాలైన వంజర్, మలక్ చించోలీ, కంకెట గ్రామాల్లో పర్యటించారు. స్వర్ణవాగు, దోనిగాం వాగు పరివాహక ప్రాంతాల్లో దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించి రెవెన్యూ, వ్యవసాయ అధికారులు సర్వే చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. అధైర్యపడొద్దని పంట నష్టపరిహారం అందేలా చూస్తామని రైతులకు బరోసా కల్పించారు. భారీ వర్షాలకు రోడ్లు కోతకు గురైన రహదారులకు మరమ్మతు చెపట్టెందుకు చర్యలు తీసుకోవాలని సంబధిత అధికారులకు ఆదేశించారు. వారి వెంట ఆయా శాఖల అధికారులు, మండల ఇన్‌చార్జీ అల్లోల మురళీధర్‌రెడ్డి, రైతుబంధు జిల్లా అధ్యక్షులు వెంకట్‌రామ్ రెడ్డి, ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, సొసైటీ చైర్మెన్లు నారాయణరెడ్డి, మాణిక్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఆశ్రిత శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ మాధవ్‌రావు, ఆయ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు రైతులు పాల్గొన్నారు.



పట్టణాభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే జోగు రామన్న



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గతంలో ఎప్పుడూ లేని విధంగా పట్టణాభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. శనివారం పట్టణంలోని పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా స్థానిక హమాలివాడలో నిర్మించనున్న బీటీ రహదారి నిర్మాణ పనులను ప్రారంభించారు. మార్కెట్ యార్డ్ నుంచి తాటిగూడ వరకు రూ.90లక్షల వ్యయంతో నిర్మించనున్న రహదారి నిర్మాణ పనులను స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. అదే విధంగా గాంధీనగర్, హమాలివాడ, సుభాష్‌నగర్, కొలిపురలలోని సవారిబంగ్లాల షెడ్లను లాంచనంగా ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యేను శాలువాలతో ఘనంగా సత్కరించారు.

కోట్లాది రూపాయలతో పట్టణాభివృద్ధి...

ఆదిలాబాద్ పట్టణ సుందరీకరణతో పాటు కోట్లాది రూపాయలను వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. అభివృద్ధికి దూరంగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రజలకు అన్ని రకాల మౌలిక వసతులు కల్పించామని పేర్కొన్నారు. భారీ వర్షాలు కురిసినప్పటికీ అక్కడక్కడ కొంత ఇబ్బందులు ఎదురయ్యాయని, వాటిని సైతం త్వరితగతిన పరిష్కరించేలా మున్సిపల్ యంత్రాంగం చర్యలు చేపట్టిందని తెలిపారు. భారీ అండర్ డ్రైనేజ్‌ల నిర్మాణాలతో ఎక్కడా వర్షపు నీరు ఆగడం లేదని అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రతిపక్ష బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులకు కనిపించడం లేదాని అన్నారు. కేవలం రాజకీయ పబ్బం గడుపుకోవడమే లక్ష్యంగా అనవసర విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు అలాల్ అజయ్, ఫ్లోర్ లీడర్ బండారి సతీష్, కౌన్సిలర్లు అశోక్ స్వామి, పందిరి భూమన్న, దర్శనాల లక్ష్మణ్, కోవ రవి, కొండ గణేష్, రైతుబంధు సమితి అధ్యక్షులు రోకండ్ల రమేష్ పాల్గొన్నారు.

భారీ వర్షాలకు తెగిన రోడ్డు

నవతెలంగాణ-తలమడుగు

ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు మండలంలో రైతులకు పంటనష్టం వాటిల్లింది. మండలంలో భారీ వర్షాలకు రోడ్డు, పంటలు కొట్టుకు పోగా, చెరువులకు గండ్లు పడ్డాయి. గతంలో తలమడుగు సఖినాపూర్ గ్రామాల మధ్య నిర్మించిన చెరువుకు గండిపడటంతో రైతులు గమనించి, స్థానిక తహసీల్దార్, ఇరిగేషన్ అధికారులకు సమాచారం అందించారు. అధికారులు వెంటనే వెళ్లి అదే రోజు రాత్రి తలమడుగు రైతులు సహాయంతో గండి వద్ద దాదాపు 500 ఇసుక బస్తాలను వేయడంతో ప్రమాదం తప్పింది. సరైన సమయంలో అధికారులు, రైతులు స్పందించకపోతే చెరువు తెగి వందలాది ఎకరాలకు నష్టం వాటిల్లేదని పేర్కొన్నారు. భరంపూర్ గ్రామ సమీపంలోని లోలెవల్ వంతెన పూర్తిగా కొట్టుకపోవడంతో గత నాలుగు రోజుల నుంచి రవాణాతో పాటు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. లోలెవల్ వంతెన, రోడ్డు తెగిపోవడంతో పల్లి(కె), నర్సాపూర్, భరంపూర్, మధనపూర్, నందిగామ, న్యూనందిగామ, నర్సాపూర్, కొలాంగూడ, సఖినాపూర్, కడపల్లే, నడుంపల్లి, అర్లి, చెర్లపల్లి, ఝరి, శేకుగూడ, టొక్కిగూడ, పూనగూడ, శేరుగూడ, 24 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. సోమవారం నుంచి పాఠశాలలు మొదలు కావడంతో బస్ సౌకర్యం లేక పిల్లలకు, ఉపాధ్యాయులకు, రైతులకు జిల్లా కేంద్రానికి అత్యవసర పనులపై వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధికారులు స్పందించి, వెంటనే బ్రిడ్జిని మరమ్మతులు చేసి రవాణా సౌకర్యం కల్పించాలని కోరారు.



పారిశుధ్య కార్మికుల వంటావార్పు



నవతెలంగాణ-దస్తురాబాద్

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మండల అధ్యక్షులు పోతు శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మెలో భాగంగా 24వ రోజు వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. మల్టీ పర్పస్ విధానాన్ని రద్దుచేసి కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించి ఉద్యోగ భద్రత కల్పించాలని, న్యాయమైన డిమాండ్లను అంగీకరించి, రాష్ట్ర ప్రభుత్వం కార్మికులను ఆదుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు లింగన్న, ఉపాధ్యక్షులు రామన్న, నర్సయ్య, ప్రధాన కార్యదర్శి పెద్దులు, సహాయ కార్యదర్శి రాజేందర్, గంగన్న, అంజన్న ఉన్నారు.

దెబ్బతిన్న రోడ్డు పనులు పూర్తి చేయాలి

- జెడ్పీచైర్మెన్ రాథోడ్ జనార్ధన్



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్డు పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని జెడ్పీ చైర్మెన్ రాథోడ్ జనార్ధన్ ఆర్ అండ్ బీ అధికారులకు ఆదేశించారు. శనివారం ఆయన మండలంలోని ముత్నూర్ త్రివేణి సంగమం చెరువు, వద్ద కోతకు గురైన ప్రధాన రహదారి వద్ద అధికారులతో పరిశీలించారు. జిల్లా కేంద్రం నుంచి ఉట్నూర్ వైపు వెళ్లే వాహనాలకు ఇబ్బంది కలిగే అవకాశం ఉన్నందున పూడ్చి ఈత పనులను వేగవంతం చేయాలని ఆర్ అండ్ బి ఎస్ఈ రాజేందర్ నాయక్‌ను సూచించారు. ఈ సందర్భంగా ఆయన వెంట ఈ ఈ నర్సయ్య, జిల్లా కోఆప్షన్ సభ్యులు అంజాద్ ఉన్నారు.

కొండాపూర్ బ్రిడ్జికి తాత్కాలిక మరమ్మతులు

నవతెలంగాణ-సిరికొండ

ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు కొట్టుకుపోయిన కొండాపూర్ బ్రిడ్జి అప్రోచ్ రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టేందుకు ఎంపీ సోయం బాపురావు తన నిధుల నుంచి రూ.5 లక్షలతో మరమ్మతులు చేపడతామని అన్నారు. శనివారం కొట్టుకుపోయిన వంతెన అప్రోచ్ రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నిధులతో నూతనంగా మంజూరైన పనుల్లో తీవ్ర జాప్యం కలుగుతోందని అన్నారు. పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అమృత్‌రావు, జెడ్పీటీసీ చంద్రకళ రఘురాం, మండల అధ్యక్షుడు అమూల్ పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



నవతెలంగాణ-కడెం

అడవుల రక్షణ, వన్యప్రాణుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కడెం ఎఫ్ఆర్వో అనిత సూచించారు. శనివారం ప్రపంచ పులుల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో మండల అటవీ అధికారులు సిబ్బందితో కలిసి సేవ్ ది టైగర్ సేవ్ ది నేషన్ అంటూ ఫారెస్ట్ అధికారులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్వో అనిత మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతగా అడవులను రక్షించాలని అన్నారు. అడవులతోనే మానవాళికి ఆక్సిజన్ అందుతుందని అన్నారు. అడవులలో ఉండే వన్యప్రాణులకు పులులకు ఎటువంటి హాని కలగకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. మానవ మనుగడకు అడవులు ఎంతగానో ఉపయోగపడతాయని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల అటవీ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

హోమియోపతి వైద్య సేవలను వినియోగించుకోవాలి



నవతెలంగాణ-ఉట్నూర్

ప్రతి ఒక్కరూ హోమియోపతి వైద్య సేవలను వినియోగించుకోవాలని ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ చైర్మెన్ జాధవ్ శ్రీరామ్ సూచించారు. శనివారం మండలంలోని లింగోజీ తండా గ్రామంలో హోమియోపతి వైద్యశిబిరం నిర్వహించారు. ఆయుష్ ఆరోగ్య దీపిక కరపత్రాలను విడుదల చేశారు. ఉచిత హోమియోపతి వైద్య శిబిరాన్ని ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ చైర్మెన్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హోమియోపతి వైద్య శిబిరాన్ని గ్రామ ప్రజలు వినియోగించుకోవాలని అన్నారు. ఈ వైద్యం ద్వారా ఎలాంటి దుష్ప్రభావాలు ఉండవని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బాలాజీ, స్థానిక సర్పంచ్ జాదవ్ హరినాయక్, హోమియోపతి వైద్యురాలు దేవరకొండ హర్షిణి, డాక్టర్ నారాయణ, నాయకులు మహేష్, స్వామి, అంజాద్ ఖాన్ ఉన్నారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
3
ఆదివారం 30 జులై 2023

హై వోల్టేజీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

నవతెలంగాణ-కాసిపేట



మండలంలోని సోమగూడెం(కే) గ్రామ పంచాయతీలోని ట్యాంక్ బస్తీలో గత కొన్నేళ్లుగా ఉన్న విద్యుత్ లో వోల్టేజీ సమస్య ఉండగా హై వోల్టేజ్ ట్రాన్స్ ఫార్మర్ పెట్టడంతో సమస్య పరిష్కారమైనట్లు సర్పంచ్ సపాట్ శంకర్ తెలిపారు. గ్రామంలో లోవోల్టేజీతో నెలకొన్న ఇబ్బందులను విద్యుత్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి 15 కేవీఏ నుంచి 25 కేవీఏ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడంతో సమస్య పరిష్కారమైనట్లు వివరించారు. విద్యుత్ ఏడీ శ్రీనివాస్. ఏఈ స్వర్ణలత, లైన్ ఇన్స్‌పెక్టర్ సుమన్, జేఎల్ఎం ప్రవీణ్, అజ్మీర స్వప్న, గ్రామస్తులు సపాట్ చందు, అజ్మీర శ్రీనివాస్, ఎనగందులు వినోద్, దుర్గం విజయ్, బోగె సత్తయ్య, ధర్మయ్యలు పాల్గొన్నారు.

24వ రోజుకు చేరిన జీపీ కార్మికుల సమ్మె

నవతెలంగాణ-రెబ్బెన



గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని 24వ రోజు సమ్మె చేసిన కార్మికులు శనివారం మండలకేంద్రంలో పంచాయతీ రాజ్ శాఖ కమీషనర్ హనుమంత్‌రావుకు వినతిపత్రం అందజేశారు. మండలకేంద్రంలో పారిశుధ్య పనులు చేయిస్తున్న పంచాయతీ కార్యదర్శి రవీందర్, కూలీలు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్చలకు పిలిచి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు నాగవెల్లి సుధాకర్, దుర్గం వెంకటి, గోగర్ల శంకర్, దేవాజీ, ప్రకాష్, బాబాజీ, శ్రీనివాస్, లక్ష్మి, శోభ, రాజమ్మ పాల్గొన్నారు.

వరద ముంచింది.. బురద మిగిలింది..!

- తేరుకున్న ముంపు ప్రాంతాలు
- ఆందోళనలో వరద బాధితులు
- ఇండ్లలో పాడైన విలువైన సామాగ్రి
- ప్రతిపక్షాలు, ప్రజాసంఘాల పరామర్శలు

నవతెలంగాణ-హాజీపూర్



పది రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు, శ్రీరామ్ సాగర్, కడెం, ఎల్లంపల్లి ప్రాజెక్టుల గేట్లు ఎత్తడంతో గురువారం అర్ధ రాత్రి మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ కాలనీ, రాంనగర్, ఎల్ ఏఎల్ఐసి కాలనీ, ఆదిత్య ఎంక్లేవ్, డూప్లెక్స్ కాలనీల్లో సుమారు 600 నివాస గృహాలు వరదల్లో మునిగి పోయాయి. ప్రాణ భయంతో కొందరు ఇంట్లోని సామాగ్రిని వదిలేసి పిల్ల పాపలతో పునారావస కేంద్రాలకు, బంధువుల ఇండ్లకు వెళ్ళిపోయారు. శుక్ర వారం సాయంత్రం వరకు వరద నీటి లోనే ఇండ్లు, ఇంట్లోని సామాగ్రి తడిసి ముద్దయ్యాయి. శనివారం రోజంతా శుభ్రం చేసిన కానీ ఇండ్లు మునుపటి స్థాయికి రావడం లేదని, బురదను తుడుచు కుంటు బాధితులు కన్నీటి పర్యంతమయ్యారు.

ప్రత్యామ్నాయ చర్యలేవి..?

ఎన్టీఆర్ నగర్, రాంనగర్, ఎల్ ఏఎల్ఐసి కాలనీలు ఏర్పాటై 20 ఏండ్లు కావస్తోంది. గతంలో ఎన్నడూ లేని ముంపు ఇప్పుడు ఎందుకు వస్తుందని ఆయా కాలనీలు వాసులు ప్రశ్నిస్తున్నారు. కాళేశ్వరం, ఎల్లంపల్లి నిర్మాణాలతో ముంపు ప్రాంతాలపై కనీస అవగాహన లేదా అని ఆగ్రహం వెల్లగక్కుతున్నారు. రెండేళ్లలో మూడు సార్లు ఇండ్లు మునిగితే ఎలా కోలుకునేది అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది ముంపుకు గురైన సందర్భంలో ప్రభుత్వం ఇస్తామన్న పరిహారం ఇప్పటికీ అందక పోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గోదావరి, రాళ్ల వాగు చుట్టూ కరకట్ట నిర్మిస్తే ముంపు సమస్య తగ్గే అవకాశం వుందని ఆయా కాలనీల వాసులు సూచిస్తున్నారు. లేని పక్షంలో మా ఇండ్లకు ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం పూర్తి పరిహారం అందించి, ఇంటి నిర్మాణ కోసం రెండు గంటల స్థలం కేటాయించాలని ముంపు ప్రాంతాల వాసులు కోరుతున్నారు.



బాధితులకు ప్రజా సంఘాల పరామర్శ

మంచిర్యాల పట్టణంలో గురువారం రాత్రి మునిగిన ఇండ్లను ప్రజా సంఘాల నాయకులు, ప్రతిపక్ష నాయకులు సందర్శించారు. బాధితులను ఓదారుస్తు పరిహారం, శాశ్వత పరిష్కారం కోసం మీతో పోరాటానికి సిద్ధం అంటూ బాధితులకు బరోసా కల్పించారు. ఆగస్ట్, సెప్టెంబర్‌లో కూడా అధిక వర్షాలు కురిసే అవకాశం ఉందని, తక్షణమే ముంపు ప్రాంతాల బాధితుల ఇండ్లకు పూర్తి పరిహారం అందించి, వేరే చోట ఇంటి నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. దూర దృష్టి లేకుండా సీఎం కాళేశ్వరం కట్టి ఇక్కడి ప్రాంత వాసులకు తీరని అన్యాయం చేస్తే, ఇక్కడి ఎమ్మెల్యే అనాలోచిత నిర్ణయాలతో రూ.20 కోట్లతో నిర్మించిన ఎంసీహెచ్ గోదావరిలో కలిసిందని పేర్కొన్నారు. రెండేళ్లుగా వరదలు వచ్చి ఇండ్లు మునుగుతుంటే ఎమ్మెల్యే చేపట్టిన చర్యలు ఏంటని ప్రశ్నించారు.

వేరే చోట స్థలం కేటాయించి ఇల్లు కట్టివ్వాలి

చింతల జాలమ్మ, ఎన్టీఆర్ కాలనీ, మంచిర్యాల



ఎన్టీఆర్ నగర్‌లో ఇల్లు కట్టుకుని 15 ఏళ్లుగా ఉంటున్నాము. ఎన్నడూ లేని విధంగా గత రెండు సంవత్సరాలుగా ఇండ్లు మునుగు తున్నాయి. గతేడాది మునిగితే ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే పరిహారం ఇప్పిస్త అన్నాడు. ఇప్పుడు మళ్లీ మునిగింది. ఇప్పటికైనా పరిహారం ఇస్తారోలేదో తెలియదు. ఈ సారైనా పరిహారం చెల్లించి వేరే చోట స్థలం ఇచ్చి ఇండ్లు కట్టించాలి.

మూడు సార్లు మునిగింది

అశోక్ మెకానిక్ ,రాం నగర్,మంచిర్యాల



రాంనగర్‌లో ఆదే స్థలంలో ఓ షెడ్డు వేసుకొని మెకానిక్ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్న. రెండేళ్లలో వరద కారణంగా మూడు సార్లు శెట్టర్ మునిగింది. అందులోని సామాగ్రి తడిసి పాడైపోతుంది. విలువైన మిషనరీ చెడిపోయింది. మునిగినపడల్ల రూ.30 వేల నష్టం వస్తుంది. ప్రభుత్వం పరిహారం అందించి మమ్మల్ని ఆదుకోవాలి.

వరదల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలి

- వరద ప్రాంతాలో పర్యటించిన ఎమ్మెల్యే ఆత్రం సక్కు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

వర్షాలు సాధారణ కంటే ఎక్కువగా కురుస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు సూచించారు. మండలంలోని తుంపల్లి వాగు పరిశీలించి ఘటన వివరాలు అడిగి తెలుసుకుని, ఘటనలో గల్లంతైన వారి కుటుంబాలను పరామర్శించి ధైర్యం చెప్పారు. అదేవిదంగా నియోజకవర్గంలోని వరద ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుంపల్లి ఘటన బాదకరమన్నారు. గల్లంతైన వారి కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలియజేశారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు వర్షాల సమయంలో అవసరమైతేనే ఇండ్ల నుండి బయటకు రావాలన్నారు. ప్రవాహాల వద్ద అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భారీ వర్షాలు కురుస్తున్నప్పుడు అధికారులు అప్రమత్తంగా ఉండి అందుబాటులో ఉండాలన్నారు. వర్షాలకు దెబ్బతిన్న రహదారులను వెంటనే మరమ్మతులు చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వర్షానికి నష్టపోయిన పంటలకు సంబంధించి అధికారులు సర్వే చేస్తున్నారని రైతులు అధైర్య పడకూడదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మల్లికార్జున్, తహసీల్దార్ రాంమోహన్‌రావు, ఎంపీడీఓ శశికళ, స్థానిక సర్పంచ్ కొడప వరలక్ష్మి, ఎంపీఓ ప్రసాద్, మాజీ ఎంపీపీ బాలేష్‌గౌడ్ పాల్గొన్నారు.

గల్లంతైన వారి కోసం ముమ్మర గాలింపు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మండలంలోని తుంపల్లి వాగులో గల్లంతయిన వారి కోసం శనివారం గజ ఈతగాళ్ల సహాయంతో అధికారులు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. ఉదయం నుంచి గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ సాయంత్రం వరకు కూడా ఆచూకీ లభించలేదు. ఎంపీపీ మల్లికార్జున్, తహసీల్దార్ రామ్మోహన్‌రావుతో పాటు ఇతర అధికారులు వాగు వద్ద పరిస్థితిని పరిశీలించారు. ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్ గాలింపు చర్యలు పరిశీలించారు. బాధిత కుటుంబ సభ్యులు గల్లంతైన వారు లభిస్తారని ఆశతో ఎదురు చూడడం మినహా చేసేదేమీ లేకుండా పోయింది. 30 గంటలు గడిచినప్పటికీ గల్లంతైన వారు లభించకపోవడంపై గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కడెం ప్రాజెక్టుపై ప్రభుత్వం నిర్లక్ష్యం తగదు



నవతెలంగాణ-జన్నారం

కడెం ప్రాజెక్టుపై ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముజాఫర్‌అలీ ఖాన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనా మాట్లాడారు. గత సంవత్సరం భారీ వర్షాలకు కడెం ప్రాజెక్టు తెగిపోయే ప్రమాదం సంభవించిందని అన్నారు. పక్కనుంచి నీరు పోవడం వల్ల ఆ ప్రాజెక్టు తెగిపోకుండా గండం గట్టెంకిదన్నాఇ మళ్లీ ఈ సంవత్సరం కూడా అలాంటి పరిస్థితి నెలకొన్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తూ ప్రాజెక్టును పట్టించుకోకుండా, మీనమేశాలు లెక్కబెట్టడం సరైన పద్ధతి కాదన్నారు. సంవత్సరం పొడవునా అధికారులు స్పందించి ప్రాజెక్టును మరమ్మతులు చేయించి ఉంటే, ఈ సంవత్సరం ఇలాంటి దుస్థితి ప్రాజెక్టు పట్టేది కాదన్నారు. గత సంవత్సరం అధిక వర్షాలకు గోదావరి పరివాహక ప్రాంత గ్రామాలు నీట మునగగా వారిని ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం చెందిందన్నారు. వరద బాధితులను వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఆదివాసి స్టేట్ కోఆర్డినేటర్ పుర్క బాపూరావు, ఖానాపూర్ నియోజకవర్గ నాయకులు జాదవ్ సునీల్, మండల నాయకులు మహమ్మద్‌అజహర్, బొట్ల భాగ్య రావు, నందునాయక్, మైనార్టీ నాయకులు వసీం పటేల్, యువ నాయకులు దుర్వ మహేష్, ఆదివాసి నాయకులు బానోత్ రోహిదాస్, ఎండీ సిరాజ్, సీనియర్ కర్యకర్త రాథోడ్ ప్రశాంత్ పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడికి సన్మానం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పద్మశాలి సేవా సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నికైన ఇరుకుల్ల ఆంజనేయులు శనివారం ఆసిఫాబాద్ పద్మశాలి మహిళా సంఘం ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ పద్మశాలీల ఐక్యత కోసం తన వంతుగా కృషి చేస్తానని తెలిపారు. సంఘం బలోపేతానికి అందర్నీ కలుపుకొని వెళ్లేందుకు శయశక్తుల కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మాజీ మహిళ అధ్యక్షురాలు ఇరుకుల్లా మంగ, మహిళా సంఘం అధ్యక్షురాలు రాంపల్లి విజయ, ప్రధాన కార్యదర్శి చెన్నూరి సునీత, కోశాధికారి జంజరాల పుష్పలత, సభ్యులు వనమాల, జయ, అనుమండ్ల సుజాత, మంచికట్ల సుశీల, హనుమండ్ల జ్యోతి, పొన్న సంగీత, జంజిరాల స్వప్న, వనమాల లావణ్య గడదాసు రోజా, కోమటిపల్లి సుశీల పాల్గొన్నారు.

పులుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



నవతెలంగాణ-సిర్పూర్(టీ)

వన్యప్రాణులలో ప్రధానమైనది పులి అని, వాటిని సంరక్షించే భాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అటవీ శాఖ సిర్పూర్ రేంజ్ అధికారి సీహెచ్ పూర్ణచంధర్ అన్నారు. శనివారం అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని అటవీ సమీప గ్రామాలైన చీలపెల్లి, ఇటుకల్ పహడ్ గ్రామాల్లో పులుల సంరక్షణపై అవగాహన కల్పించారు. అనంతరం అటవీ శాఖ అధికారులు గ్రామాల్లో ర్యాలీ నిర్వహించి గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్యప్రాణులను వేటాడడానికి విద్యుత్ తీగలు, ఉచ్చులు అమర్చకూడదని, వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అటవీ ప్రాంతాల్లో నివసించే ప్రజలు వన్యప్రాణులకు ఎలాంటి హాని కలుగకుండా చూడాలన్నారు. అలాగే పులి కూడా తిరుగుతుందని దానికి ఎలాంటి హాని తలపెట్టకూడదని, సమీప అటవీ ప్రాంతాల్లో వ్యవసాయం చేసుకుంటున్న రైతులు, పశువుల కాపర్లు జాగ్రత్తగా ఉండాలని, ఎవరైనా కొత్త వారు కనిపిస్తే సమాచారం అందించాలని అన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ యాదగిరి, బ్రహ్మయ్య, సెక్షన్ అధికారులు మోహన్‌రావు, తిరుపతి పాల్గొన్నారు.

జన్నారం : పర్యావరణ సమతుల్యత పులుల సంరక్షణతోనే సాధ్యమవుతుందని జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, ఎఫ్ఆర్ఓలు ఆఫీస్ ఉద్దీన్, రత్నాకర్ రావులు అన్నారు. ప్రపంచ పులుల దినోత్సవం సందర్భంగా శనివారం మండల కేంద్రంలో ప్రజా ప్రతినిధులు అటవీ శాఖ అధికారులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండలంలోని వివిధ పాఠశాలకు చెందిన విద్యార్థులకు వ్యాసరచన, తినలేఖనం పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యుడు మున్వర్‌అలీ ఖాన్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మమ్మద్ రియాజుద్దీన్, బీజేపీ నాయకులు మధుసూదన్‌రావు, మోటివేషన్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ప్రకాష్ నాయక్ పాల్గొన్నారు.



రోడ్డుపై భోజనం చేస్తూ నిరసన

నవతెలంగాణ-ముధోల్



తమ సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేస్తున్న పంచాయతీ పారిశుధ్య కార్మికులు శనివారం రోడ్డుపై భోజనం చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. మండలంలోని ముధోల్-బైంసా రోడ్డుపై పారిశుధ్య కార్మికులు 24 రోజులుగా సమ్మె చేస్తున్న పట్టించుకోకపోవటంతో కార్మికులు వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం సమ్మె చేస్తున్న పట్టించుకోవటం లేదని కార్మికులు ఆరోపించారు. తమ సమస్యలను పరిష్కరించేంత వరకు కొనసాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి సర్దార్ వినోద్ కుమార్, భీమ్ ఆర్మీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు విఠల్, నాయకులు అవినాష్, సాహేబ్‌రావు, కార్మికులు శంకర్, ఆకాష్, సునిల్, భూమన్న, రవి పాల్గొన్నారు.

అడవులను పెంచేందుకు అందరూ కృషి చేయాలి

ఉట్నూర్ : పులులు అంతరించకుండా ఉండాలంటే అందరూ అడవులను పెంచేందుకు కృషి చేయాలని ఎంపీపీ పంద్రా జైవంత్‌రావు అన్నారు. శనివారం అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో పలు ప్రధాన చౌక్‌ల గుండా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అడవులు అంతరించిపోవడం వల్ల పులుల సంఖ్య తగ్గుతోందని అన్నారు. విధిగా ప్రతి ఒక్కరూ చెట్లను నాటాలని అన్నారు. అడవులు అంతరించిపోకుండా కాపాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిర్సాయిపేట్ ఎంపీటీసీ ఆత్రం లచ్చు, దంతన్‌పల్లి ఎంపీటీసీ అనసూయ, ఉట్నూర్, బిర్సాయిపేట్ ఎఫ్ఆర్ఓలు అనిత, గులాం మోయినోద్దీన్, సిబ్బంది ఉన్నారు.

మొహరం పండుగలో ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-తలమడుగు

మొహరం పండుగలో ప్రజాప్రతినిధులు బిజీబిజీగా గడిపారు. చివరి రోజు కావడంతో మాజీ మంత్రి నగేష్ శనివారం కుచలాపూర్, ఉండం, తలమడుగు, రుయ్యాడి తదితర గ్రామాలలో బిజీబిజీగా గడిపి మొక్కలు తీర్చుకున్నారు. అదేవిధంగా బోథ్ నియోజకవర్గ అధికార ప్రతినిధి కిరణ్ కుమార్ కజ్జర్ల, లచ్చంపూర్ గ్రామాలలో సవారి బంగ్లాల వద్దకు వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. మొహరం పండగ సందర్భంగా ఆ గ్రామంలోని హస్సేన్ హుస్సేన్ ఫంక్షన్ వద్ద వేలాదిగా తరలివచ్చిన భక్తులకు రుయ్యాడి గ్రామస్తులు అన్నదానం నిర్వహించారు. వందలాది వాహనాలు రోడ్లపై నిలిచిపోవడంతో పలు వాహనాలు రద్దీలో చిక్కుకొని గంటల తరబడి భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. స్థానిక ఎస్సై ధనూశ్రీతో పాటు పోలీస్ సిబ్బంది పర్యవేక్షణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు రావడంతో సవారిబంగ్లా కిటకిటలాడింది. కొంత మంది భక్తులు తమ పిల్లల బరువుకు సమానంగా బెల్లాన్ని పంచిపెట్టారు. వివిధ రాష్ట్రాల, జిల్లాల నుంచి భక్తులు వచ్చి తమ కోరుకున్న కోరికలను తీర్చాలని మొక్కుకుని బంగారం, వెండి, నగదు వివిధ దేశాల కరెన్సీ నోట్లు ఉండిలో వేసి మొ క్కులు తీర్చుకున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

మండలంలోని తంతోలి గ్రామానికి చెందిన జాలం రవికి సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన రూ.60వేల చెక్కును శనివారం మాజీ ఎంపీపీ సెవ్వ లక్ష్మి జగదీష్ యాదవ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన రవికి వైద్యఖర్చులకు తెలంగాణ ప్రభుత్వం రూ.60 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును అందించిందని అన్నారు. ప్రభుత్వం కులమతాలకతీతంగా అభివృద్ధి చేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీబాయి భీంరావు, బీఆర్ఎస్ నాయకులు మల్లేష్, సురేష్, తంతోలి గ్రామస్తులు పాల్గొన్నారు.

జీఎం సేవలను చిరస్మరణీయం

నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణి సంస్థ అభివృద్ధికి, కార్మికుల సంక్షేమానికి జీఎం దేవేందర్ ఎనలేని సేవలందించారని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి తిరుపతి, ఉపాధ్యక్షుడు భయ్య మొగిళి అన్నారు. బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్‌గా విధులు నిర్వహించి హైదరాబాద్ మార్కెటింగ్‌కు పదోన్నతి బదిలీపై వెళ్తున్న జీఎంను శనివారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ విధి నిర్వహణలో బదిలీలు సర్వసాదారణమన్నారు. ఆయన ఏరియా అభివృద్ధికి చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. ఆయన బదిలీపై ఎక్కడికి వెళ్లినా సింగరేణి అభివృద్ధి కోసం అహర్నిషలు పాటుపడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి దుర్గం రవీందర్, ఏఐటీయూసీ ఆర్గనైజింగ్ కార్యదర్శులు జగ్గయ్య, కిరణ్, శేషు, రాజేష్, ఆనంద్, శివరావ్, ఖైరిగూడ ఫిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్, ఫిట్ ఇన్‌ఛార్జి అంజయ్య, నాయకులు దిలీప్, గోపాల్, కాంట్రాక్టు కార్మికుల సంఘం బ్రాంచ్ కార్యదర్శి చల్లూరి అశోక్, సహాయ కార్యదర్శి సాగర్‌గౌడ్, ఏఐవైఎఫ్ పూదరి సాయి, మండల కార్యదర్శి బాలునాయక్ పాల్గొన్నారు.

ఘనంగా మొహర్రం పర్వదిన వేడుకలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలో శనివారం మొహర్రం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇమామ్ హసన్ అలహి అస్సలం, ఇమామ్ హుస్సేన్ అలాహి అస్సలం త్యాగ నిరతికి గుర్తుగా మొహర్రం పర్వదినాన్ని పురస్కరించుకుని ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ప్రధాన వీధుల గుండా పీరీలు తీసుకుని ర్యాలీగా వెళ్లారు.

గుండి గ్రామంలో మొక్కలు చెల్లించుకున్న ఎమ్మెల్యే

పీరీల వేడుకను పురస్కరించుకొని మండలంలోని గుండి గ్రామంలో ఎమ్మెల్యే ఆత్రం సక్కు మొక్కలు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ ముస్లింల ఐక్యతకు మతసామరస్యానికి మొహర్రం పండుగ చిహ్నమని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రవీందర్, తేలి సంగం జిల్లా అధ్యక్షుడు సందీప్ పాల్గొన్నారు.

షర్బత్ పంపిణీ

మొహర్రంను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మైనారిటీ నాయకుల ఆధ్వర్యంలో షర్బత్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎండీ సల్మాన్ ఖాన్, మహమ్మద్ పాషా, కశీఫ్ హస్మి, షాబాజ్, అర్ఫాజ్, కైఫ్ షా, ఐయిమాన్, తమీమ్, సమీర్, సాయి పాల్గొన్నారు.

ఆర్కే-1ఏ గని ఏఐటీయూసీ నూతన ఫిట్ కమిటీ ఎన్నిక



రామకృష్ణాపూర్ : పట్టణంలోని స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో ఆర్కే-1ఏ గని నూతన ఫిట్ కమిటీని శనివారం ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఎండీ అక్బర్ అలీ అధ్యక్షతన ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అదే విధంగా ఏఐటీయూసీ యూనియన్‌ని బలోపేతం చేసి, వచ్చే సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలలో ఏఐటీయూసీ గెలుపుకు ప్రతి కార్యకర్త కష్టపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్రాంచి ఉపాధ్యక్షుడు ఇప్పకాయల లింగయ్య, పట్టణ ఏఐటీయూసీ సోషల్ మీడియా ఇన్‌ఛార్జి గోవిందుల రమేష్, ఆర్కే ఓసీపీ ఫిట్ సెక్రటరీ ఏ.ఆంజనేయులు, ఆర్కే-1ఏ ఫిట్ సెక్రటరీ సురమళ్ళ వినయ్ కుమార్, ఫిట్ వైస్ ప్రెసిడెంట్ గాజుల రాయమల్లు, ఫిట్ కమిటీ సభ్యులు సుంకరి గట్టయ్య, గోత్త గిరిప్రసాద్, మెడం బాల్కొటిరెడ్డి, ఏలూరి శ్రీనివాస్, దొండ కృష్ణ, సిలువేరు హరీష్, తాండ్ర రాంశంకర్, బండి మహేష్, మంద శివ, మట్ల రమేష్, మంద రమేష్, ఉడెం రఘుపతి, కొల బాణయ్య పాల్గొన్నారు.

వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న పీఆర్ కమిషనర్

రెబ్బెన : మండలంలోని గంగాపూర్ గ్రామంలో వెలిసిన బాలాజీ వెంకటేశ్వస్వామిని పంచాయతీ రాజ్ శాఖ కమీషనర్ హనుమంత్‌రావు శనివారం దర్శించుకున్నారు. అనంతరం స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. పంచాయతీ రాజ్ శాఖ కమీషనర్ హనుమంత్‌రావు ఆలయ కమిటీ చైర్మన్ వెంకటేశ్ చారి, ఆలయ ఈఓ బాపిరెడ్డి, ఆలయ కమిటీ డైరెక్టర్, గంగాపూర్ సర్పంచ్ పందిర్ల వినోద, ఎంపీపీ జుమ్మిడి సౌందర్య ఆనంద్, జెడ్పీటీసీ వేముర్ల సంతోష్ శాలువాలతో ఘనంగా సన్మానించారు.

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ డ్రైవర్

ఆసిఫాబాద్ : ఆసిఫాబాద్ డిపోలో పనిచేస్తున్న ఆర్టీసీ డ్రైవర్ జోసెఫ్ నిజాయితీ చాటుకున్నాడు. హైదరాబాద్ నుండి శుక్రవారం రాత్రి బయలుదేరిన డిపోకు చెందిన టీఎస్ 20 జెడ్ 0026 బస్సులో పెద్దపల్లికి చెందిన కలీం ఎక్కి బ్యాగు బస్సులో మర్చిపోయి దిగిపోయాడు. బ్యాగులో విలువైన కొత్త మొబైల్‌తో పాటు రూ.15000 నగదు ఉండగా ప్రయాణికుడు డిపో మేనేజర్ శ్రీధర్‌ను ఉదయం ఫోన్లో సంప్రదించాడు. వెంటనే డిఎం డ్రైవర్ జోసెఫ్ సాయంతో ప్రయాణికునికి బ్యాగ్ అందజేశారు. ఈ సందర్భంగా ప్రయాణికుడు కలీం ఆర్టీసీ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రయాణికుల సౌకర్యం కోసం కృషి చేస్తామని ఆర్టీసీ అధికారులు చెబుతున్న మాటలు మరోసారి నిజమయ్యాయి. జోసెఫ్ నిజాయితీని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో టిఐ3 భారతి, ఆర్‌హెచ్‌సి ప్రభాకర్, ఈడబ్ల్యూబీ సభ్యుడు పాల్గొన్నారు.



సవారీ షెడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే బాపురావు

నవతెలంగాణ-తలమడుగు

కుచలపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన సవారీ షెడ్డును శనివారం ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు ప్రారంభించారు. అనంతరం హసేన్ హుసేన్ దేవస్థానాన్ని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ మండల కన్వీనర్ తోట వెంకటేష్, సర్పంచ్ ప్రభ దేవరావ్, దూస సంతోష్, గీస మల్లయ్య, గంగారెడ్డి, జనార్దన్, సదాశివ్, రవీందర్, స్వామి పాల్గొన్నారు.



సింగరేణి లాభాల్లో వాటా కేటాయించాలని ధర్నా



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

సింగరేణి లాభాల్లో కాంట్రాక్ట్ కార్మికులకు వాటాను కేటాయించాలని పట్టణంలోని స్థానిక సివిల్ కార్యాలయం ఎదుట (ఎస్సీసీడబ్ల్యుయూ-ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షులు డి.బ్రహ్మానందం మాట్లాడుతూ సింగరేణిలో కాంట్రాక్టు కార్మికులు అన్ని రకాల విధులు నిర్వహిస్తున్నారని కార్మికులకు సింగరేణి యాజమాన్యం కనీసం రక్షణ పరికరాలు కల్పించడం లేదని అన్నారు. సింగరేణిలో కాంట్రాక్టు కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం పీఆర్సీని అమలు చేయడం లేదని తెలిపారు. జేబీసీసీఐలో జరిగిన అగ్రిమెంట్లను కోల్ ఇండియాలో కాంట్రాక్టు కార్మికులకు ఇస్తున్న వేతనాలను సింగరేణిలో అమలు చేయడం లేదని అన్నారు. సింగరేణి వ్యాప్తంగా సుమారు 30,000 వేల మంది కాంట్రాక్టు కార్మికుల శ్రమను సింగరేణి యాజమాన్యం, కేంద్ర, రాష్ట్ర, ప్రభుత్వాలు దోచుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి వ్యాప్తంగా కాంట్రాక్ట్ కార్మికులు అనేక పోరాటాలు చేసినప్పటికీ ఈ రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు సంఘం పెద్ద నాయకులతో జాతీయ సంఘాల నాయకుల నోర్లు మూయించిందని అన్నారు. నిత్యవసర సరుకులు విపరీతంగా పెరిగి సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు వచ్చే వేతనాలు చాలి చాలక అనేక రకాల ఆర్థిక ఇబ్బందులకు గురి అవుతున్నారని తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, వేతనాలు పెంచకపోతే భవిష్యత్తులో సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో మిలిటెంట్ పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ డివిజన్ నాయకులు గజ్జి మల్లేష్, ముత్యాల వెంకటేష్, నడిగుట్ట శంకర్, నిరంజన్, ప్రభాకర్, శ్రీను, కృష్ణమూర్తి, సూర్య ప్రసాద్, రామస్వామి, హరికృష్ణ, అప్పారావు, నగేష్, రాజన్న, శ్రీనివాస్‌రెడ్డి, ఏసుమని, రాణి, నరసమ్మ, సుజాత, శారద పాల్గొన్నారు.

'దళితుల ఆర్థికాభివృద్ధికి దళిత బంధు పథకం'



నవతెలంగాణ-జన్నారం

దళితులను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకే సీఎం కేసీఆర్ దళిత బంధు పథకాన్ని ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. శనివారం మండలంలోని ఇందన్‌పల్లి, పోన్కల్, లింగయ్యపల్లె జన్నారం గ్రామాల్లో దళిత బంధు పథకంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దళిత బంధు పథకంలో దళారులను నమ్మి మోసపోవద్దు అన్నారు. అర్హులకు నేరుగా ఈ పథకాన్ని వర్తింప చేస్తామన్నారు. దళితులంతా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి బాసటగా నిలిచి కేసీఆర్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. అనంతరం మండలంలోని, కామన్‌పల్లి గ్రామంలో జరిగే పీరీల పండుగలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు గుర్రం రాజారాంరెడ్డి, సూల్వా జనార్దన్, వైస్ ఎంపీపీ సుతారి వినయ్ కుమార్, కోఆప్షన్ సభ్యులు మున్వర్‌అలీ ఖాన్, పొనకల్ సర్పంచ్ జక్కు భూమేష్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు జాడి గంగాధర్, ఇంధన్‌పల్లి ఎంపీటీసీ సాగే శ్రావణి విక్రమ్, లింగయ్య పల్లె సర్పంచ్ రాజలింగు, కామన్‌పల్లి సర్పంచ్ పేరం మానస శ్రీనివాస్, జన్నారం సర్పంచ్ భూషణవేణి గంగాధర్‌గౌడ్ ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మమ్మద్ రియాజుద్దీన్, జిల్లా నాయకులు భరత్ కుమార్, అన్యకాంతామని, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

రెగ్యులర్ పోస్టుమాన్‌ను నియమించాలి

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని కిర్డీ గ్రామ పంచాయతీలో రెగ్యులర్ పోస్టుమాన్‌ను నియమించాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యుడు గొడిసెల కార్తీక్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెగ్యులర్ పోస్టుమాన్ లేకపోవడంతో పింఛన్ దారులు, ఉపాధిహామీ కూలీలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, సంవత్సరం నుండి ఇక్కడ పనిచేస్తున్న పోస్టుమాన్ రిటైర్డ్ కావడంతో ఆయన స్థానంలో ఆసిఫాబాద్ మండలంలోని గుండి గ్రామానికి చెందిన పోస్టుమాన్‌ను ఇన్‌చార్జిగా నియమించారని తెలిపారు. ఆయన సమయానికి రాకపోవడంతో ఉపాధిహామీ కూలీలు, ఫించన్ దారులకు నెలాఖరు వరకు కూడా పింఛన్లు అందడంలేదని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రెగ్యులర్ పోస్టుమాన్‌ను నియమించి ఉపాధిహామీ కూలీలు, పింఛన్ దారులకు డబ్బులు సమయానికి అందేలా చూడాలని డిమాండ్ చేశారు.

నెట్ బాల్ అభివృద్ధికి సహకరించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో నెట్ బాల్ అభివృద్ధికి రాష్ట్ర కమిటీలు సహకరించాలని జిల్లా నెట్ బాల్ అధ్యక్షుడు అలిబిన్ అహ్మద్ అన్నారు. మహబూబ్‌నగర్ లో రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు విక్రమాదిత్య రెడ్డి, కార్యదర్శి ఖాజాఖాన్‌ల అధ్యక్షతన జరిగిన రాష్ట్ర స్థాయి సర్వసభ్య సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులకు అవసరమైన శిక్షణ అందించినప్పుడే అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. జిల్లా నుండి జాతీయ అంతర్జాతీయ స్థాయికి పోటీపడే విధంగా క్రీడాకారులను తయారు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి అదిలాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.వేణుగోపాల్, బి.కిరణ్ కుమార్, ఆసిఫాబాద్ జిల్లా సెక్రెటరీ (పిడి) తిరుపతి, కోశాధికారి (పిఈటి) హరీష్ పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ఆదిలాబాద్ జిల్లాలో గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని జంబుల్‌ధరి గ్రామంలో కొన్ని ఇండ్లు పాక్షికంగా కూలిపోయాయి. వరదనీరు ఇండ్లలోకి చేరి నిత్యావసర సరుకులు నీట మునిగాయి. విషయం తెలుసుకున్న స్మైల్ సొసైటీ ప్రతినిధులు శనివారం గ్రామంలో పర్యటించారు. బాధిత కుటుంబాలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేసి ఉదారత చాటుకున్నారు. మానవసేవే మాధవసేవ అని ప్రతి ఆదివారం రిమ్స్‌లో అన్నదానం చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు కేమ శ్రీకాంత్, విశాల్, నవీన్, సాయి, అశోక్, రాహుల్, సునీల్, కిరణ్ పాల్గొన్నారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో పూర్తిస్థాయి రక్షణ చర్యలు

- ప్రత్యేకాధికారి హనుమంతరావు, జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా వరద ప్రభావిత ప్రాంతాలలో పూర్తిస్థాయి రక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా ప్రత్యేక అధికారి హనుమంతరావు అన్నారు. శనివారం కలెక్టర్ బొర్కడే హేమంత్, పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ జాన్‌వెస్లీతో కలిసి జిల్లాలోని 15 మండలాల ప్రత్యేక అధికారులు, నీటిపారుదల, వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో జిల్లాలు చేపట్టవలసిన కార్యక్రమాలపై సమీక్షించారు. జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ఏర్పడిన వరద పరిస్థితుల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రజారక్షణ కోసం అధికార యంత్రాంగం పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటుందని తెలిపారు. వరదలకు గురైన ప్రాంతాలలో మురుగు కాలువలలో పూడిక తీయాలని, పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలను శుభ్రపరచాలని, గ్రామీణ ప్రాంతాలలో మురుగు నీరు చేరిన చోట బ్లీచింగ్ చేయాలని, దోమలు వృద్ధి చెందకుండా నివారణ మందు పిచికారి చేయాలని తెలిపారు. ప్రతి మండలంలో రెండు లక్షల ఆయిల్ బాల్స్ అందుబాటులో ఉంచాలని, ప్రతి మంగళవారం, శుక్రవారం డ్రై డే కార్యక్రమాలు పాటించాలని, వైద్య శిబిరాలు నిర్వహించాలని, పారిశుధ్య చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాలలో అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని తెలిపారు. మండల ప్రత్యేక అధికారులు మండల స్థాయి అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలకు భరోసా కల్పించాలని తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం జిల్లాలో తీసుకున్న చర్యలపై నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. గ్రామ పంచాయతీల పరిధిలో అందుబాటులో ఉన్న నిధులను వినియోగించి చర్యలు చేపట్టాలని తెలిపారు. దెబ్బతిన్న చెరువులు, గండ్లు పడిన కాలువలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని, రైతులకు ఖరీఫ్‌లో సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కలెక్టరేట్ భవన సముదాయంలో ప్రజల సహాయార్థం కంట్రోల్ రూమ్ నం.6304686505 ఏర్పాటు చేశామని, అత్యవసర సేవల కోసం ప్రజలు సంప్రదించాలని తెలిపారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ దాసరి వేణు, ఆర్డిఓ రాజేశ్వర్, ప్రత్యేక అధికారులు, వైద్య అధికారులు, నీటిపారుదల అధికారులు పాల్గొన్నారు.

ఇథనాల్ ఫ్యాక్టరీ పనులు ఆపి తీరుతాం



నవతెలంగాణ-దిలావర్‌పూర్

మండలంలోని దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామాల మధ్య పచ్చని పొలాల్లో నిర్మిస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీని ఆపి తీరుతామని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఆదేశానుసారం శనివారం జడ్పి కోఆప్షన్ సభ్యులు యు.సుభాష్‌రావు, బీఆర్ఎస్ నాయకులు రాంకిషన్‌రెడ్డి రైతులతో పాటు వెళ్లి ఇథనాల్ ఫ్యాక్టరీ స్థాపించబోయే స్థలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు రాంకిషన్‌రెడ్డి మాట్లాడుతూ ఇథనాల్ ఫ్యాక్టరీ పనులు ఆపేవరకు బీఆర్ఎస్ రైతులకు అండగా నిలిచి పోరాడుతుందన్నారు. ఇథనాల్ ఫ్యాక్టరీ స్థాపించడం వల్ల పరిసర ప్రాంత రైతులు తీవ్రంగా నష్టపోతారని, ఫ్యాక్టరీ ద్వారా వచ్చే పొగతో వాయు కాలుష్యం ఏర్పడి, వ్యర్థపు నీరు గోదావరి నదిలో కలిసి ప్రాణహాని జరుగుతుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వీలైతే అన్ని పార్టీలను కలుపుకుని ధర్నా నిర్వహించడానికీ వెనుకాడబోమని హెచ్చరించారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సైతం ఫ్యాక్టరీ పనులు నిలిపేందుకు సంసిద్ధంగా ఉన్నారని, త్వరలో ఆయన ఈ ప్రాంతాన్ని సందర్శించి రైతులకు భరోసా ఇస్తారని పేర్కొన్నారు. వారి వెంట బీఆర్ఎస్ నాయకులు పాల్దె అనిల్, ఏలాల చిన్నారెడ్డి, పాల్దె శ్రీనివాస్, ఒడ్నం కృష్ణ, అన్వర్, నామాయి సాయన్న, పసుల గంగారెడ్డి, కుంట గంగాధర్, గుణవంత్‌రావు, కోడె నవీన్, సప్పల రవి ఉన్నారు.

పంట నష్టపరిహారం చెల్లించాలి

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు



దహెగాం : మండలంలో వరదల కారణంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పంట నష్ట పరిహారం చెల్లించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాల్వాయి హరీష్‌బాబు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని ఒడ్డుగూడ గ్రామంలో అకాల వర్షాలు, వరదల వల్ల నష్టపోయిన పత్తి చేన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు సంవత్సరాలుగా రైతులు పంటలు నష్టపోతున్నా ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా పరిహారం చెల్లించలేదని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం ఈ ఎన్నికల సంవత్సరంలోనైనా రైతులకు పంట నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి అటల్ బీమా యోజనను తెలంగాణ రాష్ట్రంలో అమలుచేస్తే రైతులకు ఇన్ని ఇబ్బందులు ఉండేవికావని, కనీసం తన వాటా ప్రీమియం కూడా కట్టలేక రైతులను ముంచుతున్నాడని అన్నారు. వెంటనే రైతులకు పరిహారం చెల్లించకపోతే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాపర్తి ధనుంజయ్, సర్పంచ్‌లు ఎలుకరి సంజీవ్, లగ్గామ దామోధర్, నాయకులు ఎలుకరి దామోధర్, చపిడె సత్యనారాయణ, వెంకన్న, సంజీవ్, ప్రదీప్, దందిరె రాజు, వడాల సురేష్, రోశన్ పాల్గొన్నారు.

బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలి



సిరికొండ : బదిలీలు, పదోన్నతులను ప్రభుత్వం వెంటనే చేపట్టాలని తెలంగాణ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు సునీల్ చౌహాన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఉపాధ్యాయులతో కలిసి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 9 సంవత్సరాలుగా పదోన్నతులు, 5 సంవత్సరాలుగా బదిలీలు లేక ఉపాధ్యాయులు తీవ్ర నిరాశలో ఉన్నారన్నారు. ఉపాధ్యాయుల సంఖ్యను తగ్గించి, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు అన్యాయం చేయడం సరికాదని తెలిపారు. వివిధ సందర్భాలలో ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా సమస్యలను పరిష్కరించడం లేదని పేర్కొన్నారు. ఆగస్టు 5న అన్ని జిల్లా కలెక్టరేట్‌ల వద్ద ధర్నా నిర్వహిస్తున్నామని, పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు తరలి రావాలని కోరారు. అనంతరం తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా గెడం కేశవ్‌రావ్, ప్రధాన కార్యదర్శిగా నరేష్, ఆర్థిక కార్యదర్శిగా గెడం దేవ్‌రావ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గులాబ్, ఏక్‌నాథ్, గోపి పాల్గొన్నారు.

ఘనంగా మొహర్రం వేడుకలు



దహెగాం : మండలంలోని అన్ని గ్రామాల్లో మొహర్రం 10వ రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండే పెద్ద సంఖ్యలో భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అగ్ని గుండాల వద్ద అసైదులా అంటూ నృత్యాలు చేశారు. దహెగాం మండల కేంద్రంలో రాత్రి వరకు మజ్మ నిర్వహించగా పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

తాండూర్ : మొహరం ఉత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. హిందూ ముస్లింలు కలిసి జరుపుకునే పీరీల పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. తొమ్మిది రోజుల పాటు పీరీలను ఆరాధించి గ్రామ పెద్ద చెరువులో నిమజ్జనం చేశారు. తాండూరు గ్రామానికి చెందిన ముస్లిం యువకులు తయారు చేసిన మొహరం షర్బత్‌ను ప్రజలకు పంపిణీ చేశారు. ఉత్సవాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా సిఐ శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో ఎస్సై ఎస్.రాజశేఖర్ బందోబస్తు నిర్వహించారు.

నీట మునిగిన పంటలను పరిశీలించిన అధికారులు



నవతెలంగాణ - కౌటాల

మండలంలోని తాటిపెల్లి, వీర్దండి, గుండాయిపేట్ గ్రామాల్లో పంటలు ప్రాణహిత ఉప్పొంగడం, వార్ధా నది నీరు ఆగడంతో నీట మునిగాయి. శనివారం తహసీల్దార్ సాయన్న, ఎస్ఐ మధుకర్ వరద ఉధృతికి నీట మునిగిన పంటలను పరిశీలించారు. రైతులెవరూ అధైర్య పడొద్దని, నీట మునిగిన పంటల వివరాలను సర్వే చేసి ప్రభుత్వానికి నివేదికలు అందజేస్తామని పేర్కొన్నారు. వారి వెంట ఎంపీడీఓ నస్రుల్లాఖాన్, ఎంపీఓ మౌనిక, పోలీస్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

నేడు మాజీ మంత్రి సీఆర్ఆర్ సంతాప సభ, పెద్దకర్మ

ఆదిలాబాద్‌టౌన్ : దివంగత నేత, మాజీ మంత్రి రామచంద్రారెడ్డి సంతాప సభను ఈ నెల 30న జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గంద్రత్ సుజాత తెలిపారు. ఈ సందర్భంగా శనివారం మీడియతో మాట్లాడుతూ వివరాలను వెల్లడించారు. ఆదివారం మావలలోని చిలుకూరి లక్ష్మి గార్డెన్‌లో ఉదయం 9గంటలకు సంతాప సభ ఉంటుందన్నారు. పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని మాజీ మంత్రి రామచంద్రారెడ్డికి ఘన నివాళులర్పించాలని కోరారు. అనంతరం పెద్ద కర్మ కార్యక్రమం ఉటుందన్నారు.

వరదలకు తెగిన రోడ్లను తక్షణమే బాగు చేయాలి



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని పలు గ్రామాలలో భారీ వర్షాలతో తెగిన రోడ్లను ప్రభుత్వం తక్షణమే బాగు చేసేలా చర్యలు తీసుకోవాలని పెంబి జడ్పిటిసి జానకి కోరారు. శనివారం మండలంలోని కొత్తపేట్, రోటిగూడ గ్రామాలలో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా భారీ వర్షాలతో ఆయా గ్రామాలలో జరిగిన నష్టాన్ని పరిశీలించారు. తెగిన రోడ్లకు మరమ్మతులు చేయాలని, బాధిత రైతులకు ప్రజలకు సహాయం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు గోలి చందు, నాయకులు రాజేందర్, తిరుపతి, మహేష్, ముక్కర గంగాధర్, రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

రైల్వే ఓవర్ బ్రిడ్జి వెంటనే పూర్తి చేయాలి



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

పట్టణంలోని క్యాసపల్లి ఓవర్ బ్రిడ్జిను వెంటనే పూర్తి చేయాలని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పల్లెరాజు డిమాండ్ చేశారు. శనివారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ క్యాతనపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు ఎనిమిది సంవత్సరాలుగా పూర్తి చేయకపోవడాన్ని నిరసిస్తూ ధర్నా చేపట్టామని తెలిపారు. 2014లో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు అప్పటి ఎంపీ వివేక్ రైల్వే ఓవర్ బ్రిడ్జికు రూ.32 కోట్ల నిధులు మంజూరు చేయించారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తరువాత రూ.27 కోట్లతో ఓవర్ బ్రిడ్జి అప్రోచ్ రోడ్ నిర్మాణ పనులు మొదలుపెట్టి ఎనిమిదేళ్లు గడిచిన ఇప్పటివరకు పూర్తి కాకపోవడంతో రైల్వే గేటు వద్ద స్థానికులు, ప్రయాణికులు, వాహనదారులు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తుందని అన్నారు. అప్రోచ్ రోడ్డు పనులు జరుగుతుండగా రాకపోకలకు ఏర్పాటుచేసిన తాత్కాలిక రోడ్డు వర్షాలకు బురదతో నిండి గుంతల మయమైందని వెంటనే రైల్వే ఓవర్ బ్రిడ్జిని పూర్తి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ జనరల్ సెక్రటరీ పిన్నింటి రఘునాథ్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపతి రాజయ్య మేకల శ్రీనివాస్, మెట్ట సుధాకర్, కొట్టే రాజయ్య, రామకృష్ణ, అక్క లచ్చన్న, భూమేష్, మాంతు రవి పాల్గొన్నారు.

మహాసభలకు తరలివెళ్లిన సీఐటీయూ నాయకులు



నవతెలంగాణ-రెబ్బెన

కొత్తగూడెంలో ఆదివారం నిర్వహించే సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం(సీఐటీయూ) ఆరో మహాసభలకు నాయకులు శనివారం తరళివెల్లారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.ఓదెలు ఆధ్వర్యంలో కార్మికులు వెళ్లారు. గత తొమ్మిది సంవత్సరాల నుండి చాలీచాలని వేతనాలతో కాంట్రాక్టు కార్మికుల కుటుంబాలు అనేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నాయన్నారు. 2022 సెప్టెంబర్‌లో చేసిన ఒప్పందాన్ని చిత్తశుద్ధితో సింగరేణి యాజమాన్యం అమలుచేయడంలేదన్నారు. జీఓ నెంబర్ 22 నోటిఫికేశన్ విడుదల చేసినట్టు చేసి గెజిట్ చేయకుండా తొక్కి పెట్టిందన్నారు. ఇప్పటికైనా జీఓ నెంబర్ 22ను అమలుచేసి కనీస వేతనాలు పెంచని పక్షంలో రాబోయే ఎన్నికల్లో కాంట్రాక్టు కార్మికుల పవర్ ఏమిటో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రుచిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు. తరళివెళ్లిన వారిలో జి ప్రవీన్, మహేష్, సత్తయ్య, దుర్గం కమలాబాయి, డోంగ్రి మీరాబాయి, చల్లూరి లక్ష్మి ఉన్నారు.

నేడు మోకుదెబ్బ మహాసభలను జయప్రదం చేయాలి

నవతెలంగాణ-జన్నారం

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని చార్వక హాస్పిటల్ పైన (జన్మభూమి నగర్, రాముని చెరువు పార్క్ పక్కన) ఆదివారం నిర్వహించే మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ సభలను విజయవంతం చేయాలని ఆ సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బాలసాని శ్రీనివాస్ గౌడ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గీత కార్పోరేషన్ చైర్మన్ పల్లే రవికుమార్ గౌడ్, తెలంగాణ గౌడ సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్, మోకుదెబ్బ జాతీయ అధ్యక్షులు అమరవేణి నర్సాగౌడ్, జాతీయ సెక్రెటరీ జనరల్ రాగుల సిద్ది రాములు గౌడ్‌తోపాటు పలువురు రాష్ట్ర నాయకులు హాజరవుతారని తెలిపారు. ఈ మహాసభలో జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ పేరును పెట్టాలని, కల్లుగీత కార్పోరేషన్‌కు రూ.5, వేల కోట్లు కేటాయించి కల్లు గీత వృత్తిని ఆధునీకరించి అభివద్ది చేయాలని డిమాండ్ చేస్తున్నాట్టు తెలిపారు.